క్లుప్తంగా

ఘనంగా మల్లన్న జాతర


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని మల్లన్న దేవాలయంలో ఆదివారం మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగరాజు, శ్రీశైలం, నాయకులు దేవేందర్ యాదవ్, సాగర్, మల్లారెడ్డిలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఆదివారం ఎమ్మెల్యే మాణిక్‌రావు రూ.2లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు అమిత్‌కుమార్, నాయకులు వహీద్, మాణిక్‌రెడ్డి, పర్వేజ్, చంద్రకాంత్, గోవింద్‌రెడ్డి, ఆశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల పరిధిలోని దామరచెరువు గ్రామానికి చెందిన యం.సాయిలుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.32 వేలు మంజురయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును ఆదివారం ఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు. నాయకులు రాధాకిషన్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన ఉత్సవ్‌కు తరలిన రైతులు


బొల్లారంలో ఖేడ్ డివిజన్ రైతులు

నారాయణఖేడ్: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆదివారం నిర్వహించిన ఉద్యాన ఉత్సవ్‌ను తిలకించేందుకు డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తరలివెళ్లారు. వివిధ స్టాళ్లను పరిశీలించారు. ఉద్యాన శాస్త్రవేత్తలు నూతన వంగడాలపై అవగాహన కల్పించినట్లు రైతులు తెలిపారు. వెళ్లినవారిలో ఏఈఓలు రఘునాథ్, సతీష్, బీటీఎం మారుతి రెడ్డి, రైతులు సాయిరెడ్డి, బాబురావు, అంజిరెడ్డి, మల్లారెడ్డి, సంతోష్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శివరాజ్ తదితరులు ఉన్నారు.

అక్బరుద్దీన్ ఓవైసీని కలిసిన నాయకులు


అక్బరుద్దీన్ ఓవైసీతో నాయకులు

నారాయణఖేడ్: ఏఐఎంఐఎం పార్టీ శాసనపక్ష నేత, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీని ఆదివారం హైదరాబాదు దారుస్సలాంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు, న్యాయవాది మొహిద్ పటేల్, నాయకులు షేక్ అంజద్, మజ్హర్, జబ్బార్, ముజీబ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ సమస్యలను, పార్టీ పరిస్థితులను వివరించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నద్ధం కావాలని ఆయన సూచించినట్లు మొహిద్‌పటేల్ తెలిపారు.

287 మందికి వైద్య పరీక్షలు


పరీక్షలు చేస్తున్న వైద్యులు

నారాయణఖేడ్: మండలంలోని అబ్బెంద గ్రామంలో మంజీర, సర్వోదయ సేవా సంస్థల ఆధ్వర్యంలో రెనోవా ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 287 మంది గ్రామస్తులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

రుణమాఫీ డబ్బుల జమ ఎప్పుడో!

- జాబితాలో పేరు ఉంది... నెల గడిచినా ఖాతాలో జమకాని డబ్బులు
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు

హత్నూర (సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ నాలుగో విడత ప్రకటించి నెల గడిచిపోయింది. వ్యవసాయ శాఖ అధికారులకు రుణమాఫీ అయిన రైతుల జాబితా సైతం వచ్చేసింది. రుణమాఫీ అయిందని తెలుసుకున్న రైతులు నెల రోజులుగా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. కానీ రైతుల ఖాతాల్లో మాత్రం డబ్బులు జమకాలేదు. దీంతో రైతులు సంతోషించాలో బాధపడాలో అర్థం కావడం లేదంటున్నారు. నాలుగవ విడత 2024 డిసెంబర్ 1న రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రకటించింది. హత్నూర మండలంలోని 745 రైతులకు రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులకు లిస్ట్ పంపించింది. హత్నూర ఎస్‌బీఐ బ్యాంకు పరిధిలో 116 మంది రైతులు, దౌల్తాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో 37, వడ్డేపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 141, డీసీసీబీ దౌల్తాబాద్ బ్యాంకులో 86, దౌల్తాబాద్ ఇండియన్ బ్యాంకులో 261, బోరపట్ల ఇండియన్ బ్యాంకులో 104 మంది రైతులకు రుణమాఫీ అయినట్లు ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులకు జాబితాను పంపించింది. దీంతో రుణమాఫీ అయిందని మండలంలోని 745 మంది రైతులు సంతోషపడ్డారు. ప్రస్తుతం వ్యవసాయ సాగు పంటకు అవసరం పడుతుందని రైతులు ఆశపడ్డారు. దీంతో రైతులు రుణమాఫీ అయిందని బ్యాంకుల చుట్టూ తిరిగితే బ్యాంక్ అధికారులు మీ ఖాతాల్లో డబ్బు జమ కాలేదని చెప్పుతుండటంతో నిరాశ చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతులందరికీ రుణమాఫీ అయిందని ప్రచారం చేసుకోగా... క్షేత్రస్థాయిలో మాత్రం ఇంకా డబ్బులు జమ కాలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నాలుగో దఫా రుణమాఫీ ప్రకటించిన రైతులందరికీ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేయాలని పలు గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.



హత్నూర మండలం దౌల్తాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్

నెలరోజులుగా తిరుగుతున్నా



రుణమాఫీ అయిందని చెప్పడంతో నెల రోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా. రూ.40 వేల పైచిలుకు డబ్బులు రుణమాఫీ అయ్యాయి. వ్యవసాయ శాఖ అధికారుల జాబితాలో పేరు వచ్చింది. కానీ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ కాలేదని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. ఎన్నిసార్లు బ్యాంకుకు వెళ్లినా డబ్బులు రాలేదంటున్నారు.

–పొట్లగల్ల కృష్ణ, రైతు, హత్నూర

బ్యాంకులో జమ కాలేదు



రుణమాఫీ అయి నెల గడిచిపోయింది. కానీ డబ్బులు బ్యాంకులో జమ కాలేదు. వెంటనే ప్రభుత్వం రుణమాఫీ డబ్బులను బ్యాంకుల్లో జమ చేయాలి. ప్రస్తుతం వ్యవసాయ పనులు కొనసాగుతున్నాయి. ఈ సమయంలోనే అవసర పడతాయి. బ్యాంకు అధికారులు సైతం ఎప్పుడు వస్తాయో చెప్పలేకపోతున్నారు.

–రామ్‌రెడ్డి, రైతు, కొన్యాల

ప్రభుత్వం విడుదల చేయలేదు

ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రకటించింది కానీ రైతుల బ్యాంకు ఖాతాలో మాత్రం డబ్బులింకా జమ చేయలేదు. వారం రోజుల క్రితమే డబ్బులు వస్తాయని బ్యాంక్ ఉన్నతాధికారులు చెప్పారు. కానీ ఇంకా రాలేదు. ఎప్పుడు వస్తాయో కూడా తమ వద్ద సమాచారం లేదు.

–ప్రత్యూష, ఇండియన్ బ్యాంక్ మేనేజర్, దౌల్తాబాద్

ఆత్మరక్షణకు కరాటే దోహదం

కాంగ్రెస్ నేత నీలం మధు


మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు: ఆత్మరక్షణ, క్రమశిక్షణకు కరాటే దోహదం చేస్తుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం కంది మండలం ఎద్దుమైలారం పరిధిలోని ఓడీఎఫ్ సారత్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వాహకులు శ్రీనివాస్ బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ స్టేట్ లెవెల్ కరాటే పోటీలను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. యుద్ధకళగా ప్రచారంలోకి వచ్చిన కరాటే వ్యక్తిగత ఆత్మరక్షణతో పాటు వ్యాయామం గాను పనికొస్తుందన్నారు. మహిళలు తమ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. కరాటే శిక్షణ అందిస్తూ ఎంతోమంది కరాటే సాధకులను తయారు చేస్తున్న సక్సెస్ షోటోకన్ కరాటే నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులి మామిడి రాజు, తలారి ఈశ్వర్, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి వెంకటేష్, రాజు గౌడ్, బాలు, సతీష్, పాండు, గోపాల్, నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరామర్శ


బాధితులతో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్)/నారాయణఖేడ్: మండలంలో ఇటీవల మరణించిన పలువురు మృతుల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇందిరానగర్‌లో రిటైర్డు హెచ్‌ఎం బి.సామేల్ తల్లి మృతి చెందింది, మార్డిలో మేదరి సాయిలు మరణించారు. దీంతో వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట మాజీ జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అలీ, నాయకులు రాములు, నాగనాథ్, సురేందర్, ప్రకాశ్ ఉన్నారు. అదేవిధంగా ఖేడ్ పట్టణానికి చెందిన వ్యాపారవేత్త కోటగిరి సత్యనారాయణ తండ్రి కోటగిరి విఠల్ సేట్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని భూపాల్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నగేశ్ సేట్, నాయకులు మల్గొండ ఉన్నారు.

సంఘీభావ సభను విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించాలని కోరుతూ ఈ నెల 11న ఉస్మానియా యూనివర్సిటీలో చేపట్టిన మేధావుల సంఘీభావసభను విజయవంతం చేయాలని రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మందా దేవేందర్, భెల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. బెల్ కాలనీలో మేధావుల సంఘీభావ సభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్న, శాగంటి అయోధ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్‌నగర్‌లో తాగునీటికి కటకట


తాగు నీటి కోసం ట్యాంక్ వద్ద వేచి ఉన్న మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హుస్సేన్ నగర్ గ్రామంలో తాగు నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. పైప్‌లైన్ పగిలిపోయి నీరంతా వృథాగా పోతున్నా అధికారులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా 15 రోజుల నుంచి గ్రామానికి తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో ఉన్న సింగిల్ ఫేజ్ మోటారు ద్వారా వస్తున్న కొద్ది పాటి నీటిని తీసుకు వెళ్తూ ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే కొద్ది పాటి నీటికోసం చాలా దూరం వెళ్ల వలసి వస్తుందని వారు తెలిపారు. పగిలిపోయిన పైప్‌లైన్‌ను బాగు చేయించాలని అధికారులకు ఎన్ని మార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని పైప్‌లైన్ బాగు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సంగారెడ్డి జోన్: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు


సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సంగారెడ్డి జోన్: మండల పరిధిలోని కుప్పానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము చదువుకున్న రోజుల పాత జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. తమ గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాల్‌కల్ మండల విద్యాధికారి మారుతీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేటలో..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఆత్మకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03లో విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. 21 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరికొకరు పలకరించుకుని ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8న జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని నిరుద్యోగ దివ్యాంగులకు ఈ నెల 8న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి అనిల్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జాబ్‌మేళాలో స్టార్ బజాజ్, బిగ్ బాస్కెట్, అమెజాన్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. నిరుద్యోగ దివ్యాంగులు సంబంధిత సర్టిఫికెట్లతో జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో హాజరుకావాలని సూచించారు.

ఉచిత వైద్యం ప్రవేశపెట్టాలి

పటాన్‌చెరు టౌన్: దేశంలో ఉచిత వైద్యాన్ని ప్రవేశపెట్టాలని సీపీఎం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ అన్నారు. సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా ముత్తంగిలోని గాయత్రీనగర్‌లో ఆదివారం ప్రణం ఆస్పత్రి సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ప్రజలందరికీ ఉచిత వైద్య పథకాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు రాజు, ఆంజనేయులు అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. కల్హేర్, మాసాన్‌పల్లి, బీబీపేట, బాచేపల్లి తదితర చోట్ల పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది సర్వే చేపట్టారు. వారు లబ్ధిదారుల వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణాచారి, రజనీకాంత్ పాల్గొన్నారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో..

జహీరాబాద్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 10 కి.మీ, 5 కి.మీ పరుగు పందెం ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలో జహీరాబాద్ మండలం కొత్తూరు బి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి కోలా రాజు విజయం సాధించి మొదటిస్థానంలో నిలిచారు.

జాతరతో ఆధ్యాత్మిక వాతావరణం


ఆలయ నిర్వాహకులతో కార్పొరేటర్ కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: జాతర్ల నిర్వహణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో బండల మల్లన్న స్వామివారి ఆలయ జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది ప్రతిష్టాత్మకంగా బండల మల్లన్న జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయం వద్ద మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు.

సమస్యల పరిష్కారంలో సర్కార్ విఫలం

తపస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఏవీఎన్‌రెడ్డి

జహీరాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తపస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం జహీరాబాద్‌లోని ఆదర్శ నగర్ పార్కులో అసద్‌గంజ్ ఉపాధ్యాయుడు, తపస్ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి గజ్జాడ నర్సింహారెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగానే ఉద్యోగ, ఉపాధ్యాయుల విషయంలో నిర్లక్ష్యపు ధోరణిని అవలంబిస్తోందన్నారు. ఉద్యోగులకు రావాల్సినటువంటి పెండింగ్ బిల్లులు, డీఏల విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న ధోరణి సరైంది కాదన్నారు. గత నెల రోజులుగా ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయ భావాలు, నైతిక విలువలను పెంచే విధంగా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, నాయకులు దత్తాత్రి, అడివప్ప, భాస్కర్, రమేష్, గోపాల్, విజయలక్ష్మి, తుకారాం, సరస్వతీ విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు ఎస్.విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కాపాడాలి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని కాజీపల్లి పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములను అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబర్ 181లోని ఖాళీ స్థలాలపై కన్నేసి బండరాళ్లను తొలగిస్తూ రాత్రికి రాత్రి కబ్జాకు పాల్పడుతున్నారని వాపోయారు. అధికారులు ప్రభుత్వ భూముల పరిరక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ **పేద విద్యార్థి చేయూత**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన పేద విద్యార్థి ఉన్నత చదువులకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి చేయూతనందించారు. గ్రామానికి చెందిన దేవర్ల ప్రభాకర్ కుమారుడు కార్తీక్ ఉన్నత చదువులకు కుటుంబ ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారిన నేపథ్యంలో విషయం తెలుసుకున్న గోవర్ధన్ రెడ్డి అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందించారు.

◆ **ఆర్థికసాయం అందజేత**

జిన్నారం (పటాన్‌చెరు): ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన సంఘటన గుమ్మడిదల మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జిన్న కనకయ్య గడ్డివాము ప్రమాదవశాత్తు కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుడికి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

◆ **బ్రాహ్మణకుంట పనులకు శంకుస్థాపన**

జిన్నారం (పటాన్‌చెరు): గ్రామీణ ప్రాంత రైతులకు అండగా నిలుస్తున్న ఆగ్రో ఫౌండేషన్, ఏషియన్ పెయింట్స్ సంస్థల ప్రతినిధులకు లక్ష్మీపతి గూడెం గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం గ్రామంలోని బ్రాహ్మణ కుంట కట్ట మరమ్మతు పనులకు సంస్థ ప్రతినిధులు గ్రామస్తుల సమక్షంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు విజయ్ కుమార్, గజేంద్ర, విష్ణు ప్రకాష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ **రక్తదానం ప్రాణదానంతో సమానం : మహేశ్వర శర్మ సిద్ధాంతి**

సంగారెడ్డి టౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. విద్యాపీఠంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తాన్ని దానంతో ఇతరుల ప్రాణాలను రక్షించిన వారవుతారన్నారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొని రక్తదానం చేశారు.

◆ **అంగన్‌వాడీ చుట్టూ జాలీ ఏర్పాటు**



హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం నస్తిపూర్ అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ లేకపోవడంతో స్తంభాలు వేసి జాలీ ఏర్పాటు చేశారు. ప్రహరీ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు జాలీ ఏర్పాటు చేయడం వల్ల కొంత మేర సమస్య తీరిందని స్థానికులు తెలిపారు. జాలీ ఏర్పాటుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ **వైకుంఠపురంలో ప్రత్యేక పూజలు**

సంగారెడ్డి టౌన్: ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురంలో ఘనంగా పూజలు నిర్వహించారు. పట్టణంలోని రామ మందిరం నుంచి వైకుంఠపురం వరకు ఆదివారం పాదయాత్ర చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జబర్దస్త్ నటుడు రాంప్రసాద్ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ **మాజీ సర్పంచ్ మృతి**


బుదేరా మాజీ సర్పంచ్ దానయ్య

మునిపల్లి(అందోల్): బుదేరా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దానయ్య ఆకస్మత్తుగా శనివారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం బుదేరాలో అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు. అంత్యక్రియల కార్యక్రమానికి మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా మల్లికార్జున స్వామి జాతర**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో ఆదివారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరను ఘనంగా జరుపుకొన్నారు. గ్రామ శివారులోని ఆలయంలో ఉదయం సుప్రభాత సేవలతో మొదలుకుని పలు ప్రత్యేక పూజలను పూజారులు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

◆ **ఘనంగా మల్లన్న జాతర**



హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులోని మల్లన్న గుట్టలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు ఆదివారం విలేకరులకు వెల్లడించారు. స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన గొల్ల కురుమ పూజారులు అనంతరం అగ్నిగుండాలు, బోనాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ముగ్గులతో వ్యాయామం

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల


ముగ్గులు పరిశీలిస్తున్న నిర్మల

సంగారెడ్డి: మహిళలను ప్రోత్సహించేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని, ముగ్గులతో మహిళలకు మంచి వ్యాయామం అవుతుందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల పేర్కొన్నారు. 'వాసవి మా ఇల్లు' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ పాఠశాలలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు ముగ్గులు చాలా బాగా వేశారని అభినందించారు.